


-పి. శైలజ

రా(త్రి సమయం. పెళ్ళి పందిరి పచ్చగా కళకళలాడుతూంది. రా(త్రి ముహూర్తం కావడంవల్ల కళ్యాణమండపం లైట్లతో దేదీప్యమానంగా ఉంది. పెళ్ళి పందిరికి కాస్త దగ్గరగా నిలుచుని ఆ సంబరాన్ని చూస్తూంది వసంత. ఆ హడావిడి ఆమె పెళ్ళి హడావిడిని గుర్తుకు తెస్తూంది. వసంత పెళ్ళి అయి సరిగ్గా ఆ రోజుకు నెల అవుతూంది. తన పెళ్ళి ఊహలతో తేలిపోతున్న వసంత తల ఎత్తి ఎదురుగా చూసేసరికి తననే చూస్తున్న సారథి. అతని కళ్ళు అత్యంత (పేమగా ఆత్మీయతతో వసంతను పలకిస్తున్నాయి. వసంత తనను చూడగానే సారథి వసంతకు సైగ చేసి ఆ హడావిడిని తప్పించుకుని మేడ మీదికి వెళ్ళాడు.

వసంత కూడా సిగ్గుతో నవ్వుకుంటూ మేడ మెట్లు ఎక్కి . బాల్కనీలోకి వచ్చి సారథి భుజం మీద చెయ్యి వేసి తనవైపు తిప్పుకుని కెవ్వుమన బోయి ఆగిపోయింది.

అతను సారధి కాదు. ఎవరో! ఆమెకు ఎక్కడా అతని మొహం చూసిన గుర్తు లేదు. అతడు చాలా (కూరంగా వసంత మొహంలోకి చూస్తున్నాడు. వసంత గొంతు తడి ఆరిపోయింది.

"మీరు . .మీరు. . ." అంటూ సారథి కోసం చుట్టూ చూసింది. అతను ఎక్కడా లేడు. చుట్టూ చూసిన వసంతకు స్పృహ తప్పి నట్లయింది. ఆశ్చర్యం! అంతవరకు కళకళలాడుతున్న కళ్యాణమండపం నిశ్శబ్దంగా శ్మశానంలా అయి పోయింది. ఎక్కడా మనుషుల అలికిడి లేదు! (ప్రకృతి స్తంభించిపోయినట్లు. అంతా నిర్మానుష్యం. మనుషులు లేరు, గాలి లేదు. అక్కడ ఏమీ లేదు. అంతా శూన్యం.

హఠాత్తుగా జరిగిన ఈ పరిణామానికి వసంత నిశ్చేష్టురాలయి చూస్తూంది.

ఆమె ముందున్న వ్యక్తి—"నేను. . ." అంటూ వికటంగా నవ్వాడు.

"నే నెవరో తెలుసుకోవాలని ఉందా? నేను నీ మృత్యువును" అంటూ భయంకరంగా పలికింది అతని కంఠం. అతని చేతులు వసంత పీకను పట్టుకున్నాయి.

"నో. . .నో. . నన్ను చంప వద్దు. . . ప్లీజ హెల్ప్ మీ!" అన్న మాటలు వసంత గొంతు దాటి రావడం లేదు. అతని పట్టు తప్పించుకోవాలని పెనుగులాడసాగింది.

"ఎవరూ నిన్ను రక్షించలేరు." వికృతంగా నవ్వుతూ, వసంతను అతి తేలికగా పైకి ఎత్తి బాల్కనీ మీది నుండి (కిందికి విసరబోయాడు అతడు.

కెవ్వుమంది వసంత.

. . . . . . . . . . . . . . . . .

"వసూ. . . ఏయ్. . .వసూ!" అంటూ ఆమెను కదిపాడు సారథి. ఆమె మరొక్కసారి కెవ్వుమంది. అతడు కంగారుపడుతూ, భార్యను దగ్గరకు తీసుకుంటూ, "వసూ! ఏమిటి? ఏం జరిగింది?" అని అడిగాడు.

"వదలండి. . .నన్ను వదలండి. . .ప్లీజ్

హెల్ప్ మీ!" అతడి చేతుల్లో నుండి గింజుకుంటూ అంది.

ఇక లాభం లేదని చెంప మీద ఒక్కటి ఇచ్చాడు. ఆ దెబ్బతో పూర్తిగా మెలకువ వచ్చిన వసంత కళ్ళు తెరిచి చూసింది.

'అది తన ఇల్లు. తన బెడ్‌రూమ్. తన భర్త చేతుల్లో తను. మైగాడ్! అది కలా? కాదు... నిజమే అనిపించేటంతటి భయంకరంగా ఉంది. ఆ శ్మశానం లాంటి పెళ్ళి పందిరి తలుచుకుంటే ఒళ్ళు జలదరిస్తూంది. ఇదివరకు ఎన్నో కలలు వచ్చాయి. కానీ, ఇలాంటి కల, ఇంత భయం కలిగించే లాగ ఎప్పుడూ రాలేదు.' కలలో వ్యక్తి గుర్తుకు రాగానే ఒంట్లో నుండి వణుకు మొదలయింది.

ఆమె భయాన్ని గమనించిన సారథి ఆమెను దగ్గరికి తీసుకుంటూ, "ఎందుకు, వసూ, అంత గట్టిగా అరిచావు? ఏదయినా పీడకల వచ్చిందా?" అని ఆప్యాయంగా అడిగాడు.

అతడికి తన కల గూర్చి చెబుతూ, కలలో తనను చంపడానికి వచ్చిన వ్యక్తిని గుర్తుకు తెచుకోసాగింది. ఎవరో ఆ వ్యక్తి? మామూలుగా కలలు వస్తే ఆ కలలు, కలలలోని మనుష్యులు అంత స్పష్టంగా గుర్తు ఉండడం జరగదు. కొన్ని కలలు నిద్ర లేచేటప్పటికే మరిచి పోతాము. అలాంటిది తన కా వ్యక్తి ఎంత బాగా గుర్తు ఉన్నాడు! అతని పోలికలు తనకు బాగా గుర్తు. ఎంత భయంకరంగా తనను చంపడానికి వచ్చాడు! ఆమె చెప్పినదంతా విన్న సారథి పకపక నవ్వుతూ—

"ఎంత సిల్లీగా ఉంది! ఈ కల గూర్చా అంత భయపడి అరిచావు" అన్నాడు.

"మీకు నవ్వులాటగా ఉంది. నే నెంత భయపడ్డానో!" దిగులుగా అంది.

"ఏయ్ పిచ్చీ! కలలకు అర్థం ఉండదు తెలుసా? నీలో అజ్ఞాతంగా దాగిన భయం కలరూపంలో వెలుపలికి వచ్చింది. భయపడకుండా పడుకో." ఓదార్పుగా అంటూ వసంతను పడుకోబెట్టాడు.

సారథి త్వరగానే నిద్రపోయాడు. కానీ, వసంత కా మిగిలిన రాత్రి నిద్ర పట్టలేదు. మరునాడు ఉదయం నిజంగానే తను సారథి బంధువుల పెళ్ళికి వెళ్ళాలి. అచ్చం పెళ్ళి పందిరి లాంటిదే తన కల లోకి వచ్చింది. ఆ వ్యక్తులు, ఆ వాతావరణమే తన కలలో కనుపించడం జరిగింది. ఈ కలకు అర్థం ఏమిటి? ఎందు కలా వచ్చింది? తన కేదయినా ప్రమాదం రాదు కదా? కలలు భవిష్యత్తులో జరగ బోయే దానికి సూచనలు అని కొందరంటారు. అదే నిజమయితే కలలోని వ్యక్తిని తను నిజంగా చూడ బోతుందా? అతడు నిజంగానే తనను చంపుతాడా? ఆలోచిస్తూ ఉండిపోయింది వసంత.

• • •

మరునాడు ఉదయం వసంత, సారథి ఇద్దరూ తయారయి బస్ స్టాండుకు వచ్చారు. ఆ రోజు రాత్రి పెళ్ళి. అక్కడికి అయిదు మైళ్ళ దూరంలో ఉన్న సత్రంలో పెళ్ళి జరుగుతూంది. పదిగంటల నుండి బస్సు కోసం ఎదురు చూసినా ఒక్క బస్సు రాలేదు. పదకొండు గంటలయింది. చూసి చూసి విసుగు వచ్చిన సారథి—"వసూ! ఈ బస్సు ఈ రోజుకు వచ్చేటట్లు లేదు. టాక్సీలో వెళదాం" అంటూ ఖాళీగా వెళుతున్న టాక్సీని చప్పట్లు చరిచి పిలిచాడు.

టాక్సీ ఆగింది. సారథి తాము వెళ్ళవలసిన కల్యాణమండపం పేరు టాక్సీ డ్రైవరుకు చెప్పి, వసంత వైపు తిరిగి, "ఎక్కు, వసూ" అన్నాడు.

వసంత టాక్సీ ఎక్కబోతూ డ్రైవర్ వైపు చూసి త్రుళ్ళి పడ్డట్టుగా అయి ఆగిపోయింది. వసంత ఒళ్ళంతా చమట పట్టసాగింది.

'అతను... అతను ... ఎక్కడ చూశాను? ఆ! ఆ మొహం తనకు బాగా గుర్తు. ఈ మొహమే రాత్రి తనను కలలో అంతగా భయపెట్టింది. ఇతనే... ఇతనే...' భయంతో ఆమె కళ్ళు పెద్దవి అయ్యాయి.

సారథి టాక్సీలో ఎక్కబోతూ వసంత వైపు చూసి ఆగిపోయాడు. వసంత మొహం ఎర్రబడింది. పెదవులు వణుకుతున్నాయి. వసంతలోని మార్పు అర్థం కాక —

"ఏమి టా ఆలస్యం? ఎక్కు, వసూ!" అన్నాడు సారథి.

"ఉహూం." తల అడ్డంగా తిప్పింది. "నేను రాను. ప్లీజ్! వెనక్కు వెళ్ళిపోదాం."

"నీ కేమయినా పిచ్చి పట్టిందా? టాక్సీ మాట్లాడాక వెనక్కు వెళదామంటావు!" అసహనంగా అడిగాడు.


"క్షమించండి. మీ రేమయినా అనండి. ఈ టాక్సీలో మాత్రం రాను. వేరే టాక్సీలో వెళదాం. లేదా ఇంకా కాస్సేపు ఎదురు చూసి బస్సులో అయినా వెళదాం. ఈ టాక్సీలో మాత్రం వచ్చినా రాను" అంది మొండిగా.

సారథికి చిరాకు వచ్చింది. "వసూ! అనవ సరంగా బజారులో సీన్ క్రియేట్ చెయ్యవద్దు." వస్తున్న కోపాన్ని అపుకుంటూ అన్నాడు.

"అదే నేను చెప్పేది... అనవసరంగా ఇక్కడ గొడవ పడటం దేనికి? ఆ టాక్సీని తిరిగి పొమ్మని చెప్పండి" అంది.

ఇదంతా చూస్తున్న టాక్సీ డ్రైవర్ "క్యా సాబ్?" అన్నాడు.

"నువ్వు వెళ్ళిపోయ్... మేము వెనక్కు తిరిగి వెళ్ళిపోతున్నాము" అనేసి నడక సాగించాడు సారథి.



అన్వేషణకు అర్థం

ఫొటో—డి. కామేశ్వర్

అతడికి కోపం వచ్చిందని గ్రహించిన వసంత, అతని వెనకే మవునంగా నడక సాగించింది. కొన్ని అడుగులు నడిచారో, లేదో వెనక పెద్ద చప్పుడు, అరుపులు, కేకలు విని ఆగిపోయారు. వాళ్ళువద్దంటే తిరిగి వెళ్ళిపోతున్న ఆ టాక్సీని ఒక డబుల్ డెక్కర్ గుద్దేసింది. రక్తపు మడుగులో టాక్సీ డ్రైవర్ పడి ఉన్నాడు.

వెనక్కు తిరిగి వచ్చి సంగతి తెలుసుకున్న సారథి భయంతో బిగుసుకుపోయాడు. ఆ టాక్సీలో తాము ఎక్కి ఉంటే... ఇప్పుడు డ్రైవర్‌తో బాటు తాము రక్తపు మడుగులో ఉండేవాడు.

అతడు వసంత వైపు చూశాడు. వసంత అతని వైపు చూసింది. ఇద్దరిలోనూ చావు తప్పించుకున్న తరవాత కలిగే రిలీఫ్. అతడు కృతజ్ఞతగా వసంతతో ఏదో అనబోతున్నంతలో వాళ్ళు వెళ్ళవలసిన బస్సు హారను వేసుకుంటూ వచ్చి బస్ స్టాండ్‌లో ఆగింది. ★